గుత్తా అమిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, పాడి రైతులు, నాయకులు

బిల్లులు చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలి

కడ్తాల్, డిసెంబర్ 26: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పాలశీత లీకరణ కేంద్రాన్ని తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి సందర్శించారు. ఈ మేరకు పాడి రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక నాయకులతో కలిసి ఆయనకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పదిహేను రోజులకొకసారి చెల్లించాల్సిన పాల బిల్లులను ప్రభుత్వం రెండు నెలలకోసారి చెల్లిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. పశువులకు దాణా కొనుగోలు చేయడం కష్టంగా ఉందన్నారు. డెయిరీ తరపున అందించే ప్రోత్సాహకాలను అందించాలన్నారు. అదే విధంగా పాలశీతలీకరణ కేంద్రంలోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, యంత్రాలు పాతబడ్డాయని, వాటి స్థానంలో నూతన భవనాలు, అధునాతన యంత్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎంసీసీ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అమిత్‌రెడ్డిని పలువురు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పాల సొసైటీ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, రైతులు రవీందర్‌రెడ్డి, సీహెచ్.మహేశ్, రాములుయాదవ్, లక్ష్మయ్య, సత్యంయాదవ్, అశోక్‌రెడ్డి, కుమార్, జగన్‌యాదవ్, బాలరాజు, కృష్ణయ్య, నాయకులు నర్సింహ, హన్మానాయక్, లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, మేనేజర్ రాధిక పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యాచారం, డిసెంబర్26 : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాచారం పీఎస్ ఏఎస్ఐ సక్రూనాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో పోలీసులు సైకిల్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, డ్రగ్స్, మాదక ద్రవ్యాల పట్ల ప్రయాణికులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్, మదక ద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా సమచారం ఇవ్వాలన్నారు. ఓటీపీలను ఇతరులతో షేర్ చేయకూడదని ఆయన తెలిపారు. ఆకతాయిలు వేధిస్తే మహిళలు, బాలికలు షీటీమ్‌ను ఆశ్రయించాలని కోరారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

విజేతలకు బహుమతులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 26: విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మరియారాణి పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న 15వ జూనియర్ చౌక్‌బాల్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో గురువారం జడ్పీ మాజీ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు మరింత ప్రోత్సహించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అడ్లెట్ శంకర్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం

చేవెళ్ల టౌన్: సీపీఐ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాబాద్, డిసెంబర్ 26: దోపిడీ రాజ్యాన్ని అంతం చేసేందుకు సీపీఐ నిరంతరం పోరాడుతుందని రంగారెడ్డిజిల్లా కార్యదర్శి జంగయ్య అన్నారు. గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా షాబాద్ మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ షాబాద్ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, నాయకులు రఘురాం, మధు, నారాయణ, శ్రీశైలం, శ్రీనివాస్, నర్సింహులు, రాములు, రామకృష్ణ, నర్సయ్య, రుక్కయ్య, పాండు, బాల్‌రాజ్ తదితరులున్నారు.

చేవెళ్ల మండల కేంద్రంలో..

చేవెళ్లటౌన్ : చేవెళ్ల మండల కేంద్రంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను సీపీఐ నేతలు ఆవిష్కరించి సంబురాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి మాట్లాడుతూ అట్టడుగు వర్గాల, పీడిత ప్రజల కోసం పార్టీ చేసిన ఉద్యమాల ఘనత ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభులింగం, అంజయ్య, ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, గీత పనివారల సంఘం మండల కార్యదర్శి కృష్ణగౌడ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, యాదగిరి, శ్రీకాంత్, పోచయ్య పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నంరూరల్ : భారత కమ్యూనిస్టుపార్టీ 100 వసంతాల ఉత్సవాలను గురువారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆ పార్టీ రాష్ట్రనాయకుడు కావలి నర్సింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సీపీఐ పార్టీ నేటికి 100సంవత్సరాలు పూర్తి చేసుకుందని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో వేలాదిమంది ప్రాణ త్యాగాలు చేసిన ఘనచరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలమ్మ, కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య, నర్సింహ, శ్రీహరి, ఎల్లయ్య, వెంకటయ్య, అబ్బయ్య పాల్గొన్నారు.

షాబాద్‌లో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

ఇబ్రహీంపట్నంలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు నర్సింహ తదితరులు

బాధిత కుటుంబానికి జైపాల్ యాదవ్ పరామర్శ

కడ్తాల్, డిసెంబర్ 26: కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ మహ్మద్ అన్వర్ కొంతకాలంగా అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. తోటి స్నేహితుడి మరణ వార్త గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కడ్తాల్ గ్రామానికి చేరుకొని స్థానిక నాయకులు, క్లాస్‌మేట్స్‌తో కలిసి అన్వర్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, సేవ్యానాయక్, వెంకటయ్యయాదవ్, లింగారెడ్డి, శ్రీను, లాయక్ అలీ, నర్సింహ, జహంగీర్‌అలీ, మహేశ్, పాండు, ఉపేందర్, ఇమ్రాన్, రవూఫ్, జావిద్, సల్మాన్ ఉన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడికి ఎమ్మెల్సీ పరామర్శ

జంగయ్యయాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్, డిసెంబర్ 26: తలకొండపల్లి మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ తండ్రి జంగయ్యయాదవ్ ఇటీవల మరణించారు. గురువారం మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, స్థానిక నాయకులతో కలిసి జంగయ్యయాదవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్, జడ్పీ వైస్ మాజీ చైర్మన్ ఈట గణేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, పత్యానాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజీబూర్ రెహమాన్, నాయకులు దశరథ్‌నాయక్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్యయాదవ్, దాసు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 26 : బీఆర్ఎస్ నాయకుడిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం మండల పరిధిలోని దండుమైలారం మాజీ సర్పంచ్ రవణమోని మల్లీశ్వరి భర్త బీఆర్ఎస్ నాయకుడు రవణమోని జంగయ్యముదిరాజ్ గురువారం మధ్యాహ్నం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఎదుట తన కారు ఆపి దిగుతుండగా.. వెనుకనుంచి వచ్చిన అదే గ్రామానికి చెందిన దూసని వెంకటేశ్ జంగయ్యపై దాడికి పాల్పడ్డాడు. అకారణంగా తమపై దాడికి పాల్పడటం సరైంది కాదని, తమపై రాజకీయ కక్షతోనే ఆయన చేసిన దాడితో నా కాలుకు క్రాక్‌వచ్చిందని, వెంకటేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

క్రీడాకారులకు బహుమతులు అందజేత

వాలీబాల్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, డిసెంబర్26: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు అన్నారు. కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ క్రీడాపోటీలు గురువారం ముగిసాయి. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆధునిక కాలంలో విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

మాడ్గుల, డిసెంబర్ 26: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం లోని భారత్ గార్డెన్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో జరుగనున్న సీపీఎం రంగారెడ్డి జిల్లా 10వ మహాసభలను మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నేతలు, ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని పార్టీ మండల సభ్యుడు కట్ట అంజయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం

కందుకూరు, డిసెంబర్ 26 : సిద్దిపేటలో ఈనెల 25 వరకు నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో కందుకూరు గ్రామానికి చెందిన శ్రీరామ్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జానా రెడ్డి, రాంబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. రాష్ట్రంలో అనేక రకాల విద్యాసమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. తనకు బాధ్యతలను అప్పగించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్కేపల్లిలో ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

మొయినాబాద్, డిసెంబర్ 26 : మున్సిపాలిటీలో గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని ఎన్కేపల్లి గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. మున్సిపాలిటీ వలన పన్నుల భారం పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిల్లోనూ గ్రామాన్ని మున్సిపాలిటిలో కలువనివ్వకుండా అడ్డుకుంటామన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా మున్సిపాలిటీలో కలుపడం ఏమిటని గ్రామస్తులు మండిపడుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు తెలుసుకుంటున్న ఐహెచ్ఆర్‌సీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 26 : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించాలని ఐహెచ్ఆర్‌సీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుడు జవాన్ లక్ష్మయ్య తమ సమస్యలను వివరించారు. మున్సిపాలిటీలో 97మంది కార్మికులు పనిచేస్తున్నామని, తమకు సరిపడా కార్మికులు లేరని తెలిపారు. పురుషులు తక్కువగా ఉన్నందున మహిళా కార్మికులను ట్రాక్టర్లపైకి ఎక్కించి చెత్త నింపుతున్నామన్నారు. అలాగే, పురుష కార్మికుల కొరత ఉందని, పనిచేసే పీపీఈ పర్సన్ ప్రొటెక్ట్ ఎక్విప్‌మెంట్ సరఫరా చేయటంలేదని కార్మికులు తెలిపారు. అలాగే, పనిలో గాయాలపాలైనా, అనారోగ్య సమస్యలు ఎదురైనా ఎవరూ పట్టించుకోవటంలేదని తెలిపారు. తమ సమస్యలపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని వివరించారు. దీనిపై స్పందించిన ఐహెచ్ఆర్‌సీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ సమస్యలపై ఉన్నత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.

బీసీ హక్కుల కోసం పోరాడుతాం

రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు బ్రహ్మయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న నాగిళ్ల జగన్

ఆమనగల్లు, డిసెంబర్ 26: రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక యువజన విభాగం అధ్యక్షుడిగా ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన నాగిళ్ల జగన్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రాం భవన్‌లో గురువారం బీసీ కులాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణానికి చెందిన నాగిళ్ల జగన్‌ను యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. జగన్‌కు రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు పి. బ్రహ్మయ్య నియామకపత్రం అందజేశారు. అనంతరం జగన్ మాట్లాడుతూ బీసీ హక్కుల కోసం పోరాటం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన అధ్యక్షుడు బ్రహ్మయ్య, రాష్ట్ర నాయకుడు ఎల్లయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు

మన్‌మర్రి గ్రామానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న గ్రామస్తులు

షాబాద్, డిసెంబర్ 26: తమ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో బాగు చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. షాబాద్ మండలంలోని మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ, బోడంపహాడ్ గ్రామాలకు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో గురువారం గ్రామానికి చెందిన 20 మంది యువకులు చందాలు వేసుకుని రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మట్టి పోయించి మరమ్మతులు చేయిస్తున్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

మణికొండ, డిసెంబర్ 26: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. సీపీఎం పార్టీ గండిపేట్ మండలం-1 మహాసభలు గురువారం మణికొండ నెమలినగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు ఎ.అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోరికల నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు అలిదేవేందర్‌లతో కలిసి రుద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయకుండా.. దేశంలో కులమతలతో రెచ్చగొడుతుందన్నారు. దేశాభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ పేద ప్రజల జీవితాలతో ఆటలాడుతుందన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యాచారం, డిసెంబర్ 26: మండలంలోని తులేకుర్దు గ్రామానికి చెందిన మద్ది జంగయ్య ఇటీవలే మరణించాడు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మండలంలోని మాల్ మార్కెట్‌లో ఇటీవల కంబాలపల్లి జంగయ్య మృతి చెందాడు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ రూ.5,000 అందజేశాడు. వీరి వెంట బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ సత్యపాల్, ఈశ్వర్, శ్రీనివాస్, చంద్రమౌళి ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

వెంకటేశ్ (ఫైల్)

మాడ్గుల్, డిసెంబర్ 26: వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని దొడ్ల పహాడ్ గ్రామంలో చోటు చేసుకున్నది. సీఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం దొడ్ల పహాడ్ గ్రామానికి చెందిన ఏదుల పెంటయ్యకు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నాడు. కుమారుడు వెంకటేశ్(26) టైల్స్ పని చేసేవాడు. గత కొంత కాలంగా వెంకటేశ్ పనికి సక్రమంగా వెళ్లకపోవడంతో తండ్రి ఏదుల పెంటయ్య మందలించటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీన ఉదయం వెంకటేశ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెంకటేశ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధుమిత్రులను అడిగినా ఎటువంటి సమాచారం లభించకపోవడంతో గురువారం వెంకటేష్ తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు సీఐ జగదీశ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొని వ్యక్తి మృతి

ఒకరి పరిస్థితి విషమం

నందిగామ,డిసెంబర్26: ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బీహర్ రాష్ట్రానికి చెందిన సోబదాస్, శాంబిదాస్ వీర్లపల్లి శివారులోని మహావీర్ పరిశ్రమలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం ఇద్దరు బైకుపై కొత్తూరు పారిశ్రమిక వాడకు వచ్చి తిరిగి వెళుతుండగా మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చి ఢీకోనడంతో బైకు నడుపుతున్న సోబదాస్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి శాంబిదాస్(30)కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియ హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీకి తరలించారు. మృతుడి సోదరుడు శ్రవణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందిగామ సీఐ ప్రసాద్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

యాచారం, డిసెంబర్ 26: మండలంలోని కుర్మిద్ద, తులేఖుర్దు గ్రామాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కుర్మిద్ద 11కేవీ పరిధిలోని కుర్మిద్ద గ్రామం, కుర్మిద్ద తండా, కుర్మిద్ద వ్యవసాయ పొలాలతో పాటు, తులేఖుర్దు 11కేవీ పరిధిలోని రైస్ మిల్లులు, కోళ్ల పారాలకు విద్యుత్‌ను సరఫరాను నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బందికి, విద్యుత్ ఇంజినీర్లకు విద్యుత్ వినియోగదారులు, రైతులు అన్ని విధాలుగా సహకరించాలని వారు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాచారం, డిసెంబర్26 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధిలో గురువారం జరిగింది. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు కథనం ప్రకారం..కందుకూరు మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన గుంపెన యాదగిరి(25) తన ద్విచక్ర వాహనంపై ఈనెల 24న సాయంత్రం కటికపల్లి గ్రామానికి వెళ్తుండగా సార్లరావులపల్లి గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం యాదగిరి ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో యాదగిరి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అతడు మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

చేవెళ్లటౌన్, డిసెంబర్ 26: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ భూపాల్ శ్రీధర్ కథనం ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన అనంతయ్య (50) బుధవారం బైక్ పైన చేవెళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా, చేవెళ్లలోని మల్లారెడ్డి గూడ గేటు సమీపంలో రాత్రి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహిస్తుండగా అనంతయ్య మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సమాజంలో ధైర్యంగా మెలగాలి

శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 26 : ఆడపిల్లలు సమాజంలో ధైర్యంగా మెలగాలని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య యువ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలికలపై శారీరిక, మానసిక, లైంగిక హింసల నిర్